క్లుప్తంగా

హరీశ్‌రావు పరామర్శ


మృతుడి తండ్రిని ఓదారుస్తున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మేనల్లుడు జంగపల్లి మణివర్మ ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం చిన్నకోడూరులో నివాళులర్పించారు. ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత: సీపీ


పదోన్నతి పొందిన వారితో సీపీఅనురాధ

సిద్దిపేటకమాన్: పదోన్నతులు పోలీసులకు మరింత బాధ్యత పెంచుతాయని సీపీ అనురాధ అన్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో ఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన అంజయ్య, వెంకన్నను తన కార్యాలయంలో సోమవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోన్నతులు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ సుభాష్‌చంద్ర బోస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ధరణికుమార్, పూర్ణ చందర్, పోలీసు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఫ్లైలెట్ ప్రాజెక్టు' పరిశీలన


ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారి అమన్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని పోరెడ్డిపల్లిలో ఫైలెట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను హడ్కో సంస్థ ప్రాజెక్టు అధికారి అమన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధివిధానాలకు లోబడి ఇళ్ల నిర్మాణం జరగాలన్నారు. నిర్మాణ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శంకర్, ఎంపీడీఓ కృష్ణయ్య, కాంగ్రెస్ నేత మంద ధర్మయ్య, హౌసింగ్ ఏఈ రహీమ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాచగిరిలో భూమిపూజ


భూమిపూజ చేస్తున్న రవీందర్‌గుప్తా, ఎంపీడీఓ మచ్చేందర్ తదితరులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరిలో భక్తులకు సౌకర్యవంతంగా బాత్రూమ్ సముదాయం నిర్మాణానికి తొలిఅడుగు పడింది. ఆని నిర్మాణానికి స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎమ్) ద్వారా రూ.3 లక్షల మంజూరైనట్లు ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా తెలిపారు. సోమవారం ఎంపీడీఓ మచ్చేందర్‌తో కలిసి ఆయన భూమిపూజ చేసి, పనులకు ప్రారంభోత్సవం చేశారు. ధర్మకర్తలు కొత్తపల్లి శ్రీనివాస్, శేఖర్‌గుప్తా పాల్గొన్నారు.

29న ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

గజ్వేల్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాల, బాలికల విభాగంలో 29, 30 తేదీలలో గజ్వేల్ మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కృష్ణ, ఎస్‌జీఎఫ్ గజ్వేల్ మండల సెక్రటరీ భవాని తెలిపారు. గజ్వేల్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని సాయి జీడీఆర్ పాఠశాల ఆవరణలో 29న బాలికలు, 30న బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరుగుతాయని, ఆసక్తి ఉన్నవారు 28లోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96037 83280 నంబరును సంప్రదించాలని కోరారు.

క్రీడాకారుల ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక చేయనున్నట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు అండర్-14, 17 బాల బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు పీడీ సుజాత (94402 31033) ను సంప్రదించాలని సూచించారు.

'మట్టి గణపతే.. మహాగణపతి'

- పర్యావరణహితంగా నవరాత్రులు నిర్వహిద్దాం
- జీస్మాట్ రాష్ట్ర నేత మల్లారెడ్డి


విద్యార్థులు, అధ్యాపకులతో ప్రిన్సిపాల్ భిక్షపతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వినాయక చవితిని పర్యావరణ హితంగా నిర్వహించుకుందామని బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం మట్టి వినాయక ప్రతిమల గురించి అవగాహన ర్యాలీ నిర్వహించి, మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మట్టి, కూరగాయలు, నవధాన్యాలు, ఆకులతో వివిధ ఆకృతులతో వినాయక విగ్రహాలు రూపొందించడం స్వాగతించదగిన విషయమన్నారు. పర్యావరణహిత ప్రతిమలను రూపొందించిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. అలాగే ప్రముఖ విద్యావేత్త చింతాకుల సత్యం మరో ప్రైవేట్ విద్యాసంస్థలో నిర్వహించిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన ప్రతిమలతో పర్యావరణానికి ముప్పు అని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు.

మట్టి ప్రతిమలే మేలు



హుస్నాబాద్: విద్యార్థులంతా తమ ఇళ్లల్లో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే వినియోగించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి సూచించారు. సోమవారం కళాశాలలో విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎకో క్లబ్, స్టాఫ్ సభ్యులు కలిసి పర్యావరణహిత మట్టి వినాయకుల తయారీపై అవగాహన కల్పించారు. వారు రూపొందించిన మట్టి ప్రతిమలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రసాయనాలను వాడి తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి కాలుష్యం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనిల్ కుమార్, ఇందిరా నాయనా దేవి, బాలరాజు, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.


ర్యాలీలో పాల్గొన్న మల్లారెడ్డి, విద్యార్థులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

సిద్దిపేటకమాన్: మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అని మున్సిపల్ కౌన్సిలర్ బోనగిరి దీప్తి సూచించారు. 39వ వార్డుతోపాటు మరో మూడు వార్డులలో ఆమె ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. ఇప్పటి వరకు 500 విగ్రహాలను ఇంటింటికీ పంపిణీ చేశామని చెప్పారు.


వినాయక విగ్రహం అందజేస్తున్న కౌన్సిలర్ దీప్తి

చిట్టి చేతులతో మట్టి గణపయ్య

సిద్దిపేటఅర్బన్: మండలంలోని బక్రిచెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మట్టి గణపతి ప్రతిమలు రూపొందించి పర్యావరణ పరిరక్షణకు సందేశాన్నిచ్చారు. పాఠశాల ఉపాధ్యాయుడు పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం మట్టి గణపతుల ప్రతిమలు తయారు చేశారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లల్లో ఉన్న ప్రతిభ వెలికితీయడంతో పాటు సంస్కృతిని పరిరక్షించినట్లు అవుతుందని హెచ్‌ఎం నాగేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుహాసిని, శ్రీశైలం, రమాదేవి, సునీత, శ్రీనివాస్, లక్ష్మయ్య, ఆంజనేయులు, సరిత పాల్గొన్నారు.


గణపతి ప్రతిమలతో విద్యార్థులు, ఉపాధ్యాయుడు పూర్ణచందర్‌రావు

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

ఏసీపీ రవీందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టి సిద్దిపేటను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చుకుందామని ఏసీపీ రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీ ఆదేశాల మేరకు బెజ్జంకిలో ఎస్‌ఐ సౌజన్య ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులకు సోమవారం క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలు, డ్రగ్స్ మహమ్మారికి బలికావద్దని సూచించారు. యువత సామాజిక రుగ్మతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. క్రీడల వల్ల స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఏసీపీ

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

సీఐ లతీఫ్


తొగుటలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ లతీఫ్

తొగుట(దుబ్బాక)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వివిధ చట్టాలు, మంచి ప్రవర్తన, సైబర్ మోసాలపై పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా తొగుట, దౌల్తాబాద్, కుకునూరుపల్లి, రాయపోల్, బేగంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీలు, అనుమానితులకు తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్ మంచి ప్రవర్తన, పరివర్తనపై కౌన్సెలింగ్ నిర్వహించారు. తొగుటలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండగ ఊరేగింపులో అల్లర్లు, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. శాంతి భద్రతలను కాపాడటం కోసం ప్రతి ఒక్కరు చట్టాన్ని గౌరవించాలని సూచించారు. ఎవరైనా తిరిగి నేరాలకు పల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు రవికాంత్‌రావు, అరుణ్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఎస్‌ఐ రవికాంత్‌రావు బాలికలకు చట్టాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, సైబర్ మోసాలు, ఈవ్ టీజింగ్ గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, ఏఎస్‌ఐ రాంరెడ్డి, షీ టీం బృందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్రూం కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సిద్దిపేట టూ టౌన్ ఎస్‌ఐ రాజేశ్, ట్రాఫిక్ ఎస్‌ఐ విజయభాస్కర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌కు పంపించే లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ మోసానికిగురైతే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఎవరైనా అవహేళనగా మాట్లాడినా.. వెంబడించినా.. విద్యార్థినులు వెంటనే 100, సిద్దిపేట షీ టీమ్ (8712667434) కాల్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్: గజ్వేల్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం గజ్వేల్, వర్గల్, రాయపోల్ మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక విద్యుత్‌శాఖ ఏఈ మారుతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంగ్లావెంకటాపూర్, అహ్మదీపూర్, ధర్మారెడ్డిపల్లి, సింగాటం, బెజుగామ, వర్గల్ మండలం మజీద్‌పల్లి, నెంటూర్, రాయపోల్ మండలంలోని బేగంపేటలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు


క్రీడల్లో పాల్గొన్న బాలిక

సిద్దిపేటజోన్: స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. వాటిని జిల్లా క్రీడలశాఖ అధికారి వెంకట్ నర్సయ్య సోమవారం ప్రారంభించారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో పరుగు, జంపింగ్, షాట్‌పుట్ టాంటి క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ అంతరపంటగా పెసర

తొగుట(దుబ్బాక): ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటగా పెసర సాగుచేస్తే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఏఈఓ నాగార్జున అన్నారు. మండలంలోని పెద్దమాసాన్‌పల్లి రైతు పన్యాల నారాయణరెడ్డి పెసర విత్తనాలు ఉత్పత్తి చేస్తున్న క్షేత్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. రైతు సూటి రకం ఎంజీజీ 385ను ఒక ఎకరాలో సాగుచేశారని, ఈ రకం పల్లాకుల తెగుళ్ల తట్టుకుని తక్కువ సమయంలో రైతులకు మంచి దిగుబడి వస్తుందని ఏఈఓ చెప్పారు. ఆయిల్‌పామ్ తోటల్లో మొక్కకు మొక్కకు మధ్య 9 మీటర్ల దూరం ఉండంతో అంతర పంటకు అనుకూలంగా ఉంటుందని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత కీలకం

- గైనకాలజిస్ట్ శిరీష

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రముఖ గైనకాలజిస్ట్ శిరీష సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగం, హెల్త్ క్లబ్, రోటరీ క్లబ్ వైద్యుల ఆధ్వర్యంలో 'ప్రమోట్ పీరియడ్ కేర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిరీష మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని, సరిగా నిద్రపోవాలని చెప్పారు. అనంతరం శానిటరీ ప్యాడ్‌లు అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యారెడ్డి, జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కల్యాణ్ చక్రవర్తి, సెక్రటరీ లక్ష్మి వాసిరెడ్డి, సర్వీస్ డైరెక్టర్ చక్రవర్తిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సుమతి, అభిషేక్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వార్డెన్‌పై చర్యలేవి?

గజ్వేల్‌రూరల్: విద్యార్థులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బాలుర హాబ్‌లోగల ఎస్సీ హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి జ్వరంతో బాధపడుతుండగా వైద్యం చేయించాల్సింది పోయి ఇంటికి వెళ్ళాలంటూ పంపించడం సరికాదని మండిపడ్డారు. గజ్వేల్ బస్టాండ్‌లో ఉన్న ఆ విద్యార్థిని గుర్తించి వైద్యం చేయించామన్నారు. శేఖర్ పాల్గొన్నారు.

◆ జిల్లాలో క్రీడా వేడుకలు

సిద్దిపేటజోన్: రానున్న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడలు, యువజనశాఖ అధికారి వెంకట నరసయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ అసత్య ప్రచారం వద్దు

మిరుదొడ్డి(దుబ్బాక): యూరియా విషయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల అసత్య ప్రచారాన్ని మానుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు హితవు పలికారు. మండల పరిధిలోని చెప్యాల క్రాస్‌రోడ్డులో సోమవారం ఆ పార్టీ జిల్లా నాయకుడు సూకూరి లింగం తదితరులు మాట్లాడారు. పోలీస్ రాజులు, సత్యనారాయణ, బాల్‌రాజు, అంజిరెడ్డి, బాల్‌నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలకంటి మనోహర్ అన్నారు. హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశం పదవీ విరమణ కార్యక్రమం పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. వార్డు కౌన్సిలర్ పూర్ణిమ, యాదవ్, ఉదయశ్రీ, సుజాత, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

◆ రోడ్లు అస్తవ్యస్తం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. కోట్ల ఆదాయం వచ్చినా భక్తులకు కనీస వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఇస్తారి, మల్లేశం, సాయిలు, బాలకిషన్ పాల్గొన్నారు.

◆ కమీషన్ ఇపించాలని వినతి

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెండింగ్ కమీషన్ డబ్బులు ఇప్పించాలని రేషన్ డీలర్లు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

సామర్థ్యం పెంపొందించడానికే మేళా

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థులలో విజ్ఞానం, సామర్థ్యాలు పెంపొందించడానికి ప్రభుత్వం టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్(టీఎల్‌ఎం) మేళా నిర్వహిస్తున్నట్టు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బెజ్జంకిలో సోమవారం నిర్వహించిన టీఎల్‌ఎం మేళాను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి, సులభతరమైన బోధన అందించడానికి ఈ మేళా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్స్, గ్రీన్‌వేస్ బయో ఎనర్జీ కంపెనీల సీఈఓలు శివాజీ నాల్కర్, రామ్‌అర్జున్ విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

నానోయూరియాతో అధిక ప్రయోజనాలు

వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్

దుబ్బాక/దుబ్బాకరూరల్: నానోయూరియా వాడకంతో రైతులు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మండలంలోని పద్మనాభునిపల్లిలో నానోయూరియా, డ్రోన్ వినియోగంపై రైతులు, ఎరువుల డీలర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరతను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నానోయూరియా అందుబాటులోకి తెచ్చాయన్నారు. ఎకరం వరి పొలానికి 500 ఎంఎల్ నానోయూరియా స్ప్రే చేస్తే 8 నుంచి 10 రోజుల్లో మంచి ఫలితాలు కనిపిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో దుబ్బాక ఎఫ్‌పీఓ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్ లింగం తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్ గురించి అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌కుమార్

వ్యాధుల బారిన పడుతున్నాం..

- డంపింగ్ యార్డును తరలించండి
- రోడ్డుపై బైఠాయించిన స్థానికులు

సిద్దిపేటరూరల్: బుస్సాపూర్ గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వల్ల తాము వ్యాధుల బారిన పడుతున్నామని, దానిని అక్కడి నుంచి తరలించాలని ఆ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను తీసుకువచ్చి అక్కడ డంపు చేయడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తా చెదారం వల్ల వస్తున్న దుర్వాసనతో గాలి కలుషితమై ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయన్నారు. కుళ్ళిపోయిన మాంసం, గుర్తుతెలియని శవాలను కూడా తీసుకువచ్చి పడవేస్తున్నారని వాపోయారు. ఆ దుర్వాసనతో చుట్టుపక్కల రైతుల కూడా వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అక్కడికి చేరి వారితో మాట్లాడారు. డంపింగ్ యార్డ్ తరలించడం తన చేతిలో లేదని, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోలీసులు గ్రామస్తులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, తహసీల్దార్ స్వామి, ఎస్‌ఐ రాజేశ్, గ్రామస్తులు శేఖర్, రేవంత్, షాదుల్ ఎల్లం, బాను, ప్రశాంత్, రంజిత్, శేఖర్, కనకయ్య, సాగర్, పరశురాములు, నర్సింహులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


డంపింగ్ యార్డు వద్ద రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు, రైతులు

ఆశా వర్కర్లకు రూ.18 వేలు చెల్లించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

సీఐటీయూ నేతలు ఎల్లయ్య, భాస్కర్

సిద్దిపేటరూరల్: ఆశా వర్కర్లకు రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం అందించాలని, రూ.50 లక్షలు ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సంద బోయిన ఎల్లయ్య, జిల్లా కోశాధికారి బర్ల భాస్కర్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఎన్నిసార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా స్పందన లేక పోవడంతో ఆశా వర్కర్లు ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, బాల్ నర్సయ్య, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మంజుల, ప్రవీణ, భాగ్యలక్ష్మి, కవిత, శ్యామల, మాలతి, బాలమణి, రేణుక పాల్గొన్నారు.

కేర్ టేకర్, ఏఎన్‌ఎంను సస్పెండ్ చేయాలి

హాస్టల్ ఎదుట విద్యార్థినుల ఆందోళన

సిద్దిపేటరూరల్: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించకుండా, విద్యార్థులపై దుర్భాషలాడుతున్న కేర్ టేకర్, ఏఎన్‌ఎంను సస్పెండ్ చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థినులు హాస్టల్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థి సంఘం నేత వేల్పుల రాజ్ కుమార్ మాట్లాడుతూ హాస్టల్ సమస్యల నిలయంగా మారిందన్నారు. విద్యార్థులు సమస్యలను కేర్ టేకర్ దృష్టికి తీసుకువస్తే వ్యక్తిగతంగా దూషించారని వాపోయారు. పురుగుల అన్నం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. వెంటనే అధికారులు స్పందిచి కేర్ టేకర్, ఏఎన్‌ఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే చర్యలు తీసుకుంటానని మండల విద్యాశాఖ అధికారి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సిద్దిపేట నగర కార్యదర్శి పరశురాం, భాను, లోకేశ్, శుభం, సౌమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చండి: సీపీఐ


ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్ దిలీప్ నాయక్, ఏఓ బోగేశ్వర్‌కు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ రైతులకు యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతువేదిక ఎదుట ఆందోళన నిర్వహించామన్నారు. రాష్ట్రంలో బీజేపీ తరఫున ఎన్నికైన ఎనిమంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా రాష్ట్ర రైతులకు ఎరువుల కొరత తీర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన 4.48 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా సరఫరా చేయకుండా ఇబ్బంది పెడుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సరిపడా ఎరువులు, యూరియా, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, బీకేఎంయూ భూమయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కనకయ్య, శ్రీనివాస్, సుదర్శన్, నర్సింహులు, కిషన్, రాజయ్య, మల్లేశం, రమేశ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.